క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో మొక్క నాటుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ సంక్షేమ పథకాలలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యులు కావటం స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడ మొక్కలు నాటాలన్నా తమ సంస్థ ద్వారా చైర్మన్ రామభద్రరాజు మొక్కలు సరఫరా చేస్తారని, శ్రీ విజ్ఞానవేదిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

మనోవేదనతో వృద్ధురాలి మృతి

పాలకొల్లు అర్బన్: వడ్లవానిపాలెంలో స్థల వివాదంలో మనో వేదనకు గురై పిట్టల బసవరత్నం (73) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో మృతురాలికి చెందిన స్థల వివాదంలో మధ్యవర్తిగా వచ్చిన ఎ.శ్రీరంగం అనే వ్యక్తి వాగ్వివాదానికి దిగారు. దీంతో శనివారం మృతురాలికి చెందిన కొబ్బరితోటలో పడిపోయి ఉంది. సరిహద్దు రైతు 108 సిబ్బందికి ఫోన్ చేయడంతో వైద్య సిబ్బంది వచ్చి వృద్ధురాలిని పరీక్షించారు. అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతురాలు కోడలు చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చంద్రబాబు పాపం పండింది

- రూ.371 కోట్లు అవినీతి చేసి అరెస్టయ్యారు
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి పక్కా ఆధారాలతో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేయడంతో టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాపం పండిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు 2014లో అధికారం చేపట్టిన వెంటనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు శ్రీకారం చుట్టారని, రూ.371 కోట్ల మేర ప్రజాధనాన్ని దోచుకున్నారని చెప్పారు. 2017లోనే బయటపడిన ఈ స్కామ్‌లో ఆధారాలు దొరకకుండా అనేక ప్రయత్నాలు చేయడంతో చంద్రబాబు అరెస్టుకు ఇంత కాలం పట్టిందని వివరించారు. తనను అరెస్టు చేస్తారని ముందుగానే ప్రచారం చేసుకున్న చంద్రబాబు అవినీతికి పాల్పడిన్నట్లు అంగీకరించినట్టేనని తెలిపారు. 2017లో స్కిల్ డెవలప్‌మెంట్ విధివిధానాలు సక్రమంగా లేకపోయినా క్యాబినెట్‌లో తీర్మానంచేసి ఒప్పందం పేరట రూ.కోట్లు విదేశాలకు పంపి, అక్కడ నుంచి తిరిగి దేశంలోని డమ్మీ కంపెనీల ద్వారా తెచ్చుకుని దోచుకున్నారని వివరించారు. రూ.3,356 కోట్ల స్కిల్ ప్రాజెక్టులో ప్రభుత్వ వాటా 10 శాతం, 90 శాతం సీమెన్స్ కంపెనీ పెట్టుకుంటుందని అన్నారు. దాదాపు రూ.3 వేల కోట్ల సీమెన్స్ ఇస్తుందని అంచనా వ్యయాన్నే డీపీఆర్‌గా చూపిస్తూ స్కిల్‌డెవల్‌మెంట్ నుంచి నోట్ పెట్టించారని తెలిపారు. ప్రభుత్వంలో సెక్రటరీ స్థాయి, ఆపైస్థాయి అన్నింటిన్నీ ఓవర్‌రూల్ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నోట్ పెట్టి స్పెషల్ ఐటెంగా అమోదముద్ర వేయించుకున్నారని, జీఓ విడుదల చేశారని వివరించారు. సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్‌ఎయిడ్ ఒక్కపైసా కూడా రాకుండానే ఐదు దఫాలుగా నాటి ప్రభుత్వం రూ.371 కోట్లు విడుదల చేసిందన్నారు. డబ్బు విడుదలపై ఆర్థికశాఖ అధికారులు కొర్రిలు పెట్టితే సీఎం చంద్రబాబు డబ్బు విడుదల చేయాలని ఆదేశాలు ఇవ్వడంపై నాటి ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ తన నోట్‌ఫైల్‌లో రాశారని తెలిపారు. సీమెన్స్ కూడా ఇంటర్నల్ ఎంక్వయిరీ చేసి 164 సీఆర్పీసీ కింద మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చిందన్నారు. ప్రభుత్వం జారీచేసిన జీఓకు, ఎంఓయూకు ఎలాంటి సంబంధం లేదని వాళ్లు కోర్టుకు తెలిపారని వివరించారు. తమ కంపెనీలో పనిచేసే సుమన్‌బోస్, మేనేజ్‌మెంట్‌నుగాని, లీగల్‌టీమ్ గాని సంప్రదించలేదని సీమెన్స్ కోర్టుకు తెలియజేసిందని అన్నారు. ఈ డబ్బు పలు సెల్ కంపెనీల ద్వారా చేతులు మారి తిరిగి వచ్చిందని వివరించారు. స్కిల్ స్కామ్ గురించి ఒక వ్యక్తి రాష్ట్రంలో ఏసీబీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. స్కిల్ స్కామ్‌లో ప్రధాన పాత్ర పోషించిన పీవీఎస్‌పీ, స్కిల్లర్, డిజైన్‌టెక్ కంపెనీలు సర్వీస్ ట్యాక్స్ కట్టకుండా సెన్‌వాట్ కోసం క్లెయిమ్ చేయగా రూ.కోట్ల మేర క్లెయిమ్ చేయడంతో జీఎస్టీ అధికారులకు అనుమానం వచ్చి ఆ కంపెనీ లావాదేవీలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాడంతో డబ్బు హవాలా మార్గంలో తరలించినట్టు తేలిందన్నారు. చంద్రబాబు చేసిన రూ.కోట్లు అవినీతి గురించి నేడు ప్రజలకు పూర్తిగా తెలిసిపోయిందన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

మొగల్తూరు: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఫణీంద్ర కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని జగన్నాథపురం జగనన్న కాలనీలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్లకు రూ.3.50 లక్షలు, రెండో సారి లెవిలింగ్‌కు రూ.2.50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో లెవిలింగ్ పూర్తికావడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు వచ్చి వేగవంతంగా నిర్మించుకోవాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ రాధాకృష్ణ, సర్వేయర్ రవికుమార్ తదితరులున్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న పుప్పాల పండు, అంబటి రమేష్

ఆకివీడు: కులం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికకంగా పింఛన్ల మంజూరు జరుగుతుందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు అన్నారు. స్థానిక మాదివాడలో కొత్త పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్ మంజూరుకు కాళ్లు అరిగిపోయే విధంగా ఆఫీసులు, నాయకుల చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అర్హులైన వారిని గుర్తించి, వారి వద్ద ఉన్న ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచి, నూతన ఫించన్ మంజూరైన తరువాత వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి పింఛన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ విధానాన్ని అమలుచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలని ఆయన పింఛన్‌దారులను కోరారు. మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, బూత్‌కన్వీనర్ ఆరేటి త్రిమూర్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్

- రాజకీయ దురుద్దేశం లేదు
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: పక్కా ఆధారాలతోనే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును అరెస్ట్ చేశారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పేర్కొన్నారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో సీఐడీ వారు చంద్రబాబును అరెస్ట్ చేశారని, దీనిలో ఎలాంటి రాజకీయ దురేద్దశం లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే ఆలోచన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికిగాని, మా పార్టీకి గాని లేదన్నారు. రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారని చెబుతూ చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టడం సబబు కాదన్నారు. కేంద్ర సంస్థలు చేసిన దర్యాప్తు ఆధారంగా సీఐడీ వారు చంద్రబాబును అరెస్ట్ చేయడం జరిగిందని మరోసారి స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంకు సంబంధించి కూలంకషంగా మూడేళ్ల దర్యాప్తు చేసిన తరువాతే చంద్రబాబును అరెస్టు చేయడం జరిగిందన్నారు. పూర్తి దర్యాప్తు జరిగిన తర్వాత కూడా నాకు ఏ పాపం తెలియదు అనడం విడ్డూరంగా ఉందన్నారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు చంద్రబాబు అని తేలిన తరువాతే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు తన హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లో రూ.371 కోట్ల అవినీతి స్కామ్, దొంగ కంపెనీల ద్వారా నగదు బదాలయింపు చేసినట్లు తేలిందన్నారు. కోర్టులో హాజరు పరిచిన తర్వాత చంద్రబాబు తన నిజాయితీ నిరూపించుకోవాలని స్పష్టం చేశారు. అంతేగాని ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రవర్తించడం కరెక్ట్ కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పళ్ళిగోళ్ళ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించాలి

నగర పంచాయతీ చైర్‌పర్సన్ హైమావతి పిలుపు



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: జన సంక్షేమ రథసారధుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించి సీఎంను చేయాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ పాదర్శకంగా పథకాలు అమలు జేస్తూ, ప్రజా జీవన విధానంలో మార్పులు తీసుకువస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై ప్రతిపక్షాలు విమర్శించడం సిగ్గుసేటు అన్నారు. పేద, అట్టడుగు వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ధర్మాపుర అగ్రహారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వేసి కౌన్సిలర్‌గా కటికతల జాన్ వెస్లీని గెలిపించారని, అదే విధంగా 20 వార్డుల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో పీవీఎల్.నర్సింహారాజు గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న ఆవిష్కరించారు. అనంతరం శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణానికి చైర్‌పర్సన్ హైమావతి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

విరిగిన రైల్వేగేటు



స్థానిక సిద్ధాపురం రోడ్డులో విరిగిన రైల్వే గేటు

ఆకివీడు: తరచూ రైల్వే గేటులు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులోని రైల్వే గేటు శనివారం సాయింత్రం విరిగిపోయింది. గూడ్స్ రైలు వెళ్లేందుకు గేటు వేస్తుండగా ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో గేటు విరిగిపోయింది. వెంటనే మ్యాన్యువల్‌గా గేటు వేసి వాహనరాకపోకల్ని నిలుపుదల చేశారు. తదనంతరం గేటుకు మరమ్మతులు నిర్వహించారు. డబల్‌లైన్‌లో తరచూ గూడ్స్, ఇతర రైళ్ల రాకపోకలు జరగడంతో వెంట వెంటనే గేట్లు వేయడం, ఎత్తడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, పటిష్టమైన గేట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్టా హోమాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఉండి పడవలరేవులో నూతనంగా నిర్మించిన సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా శనివారం పలు హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రణస్థుల మహంకాళి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు చేసిన ఏర్పాట్లలో భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా నిర్మాణం చేసిన హోమ పందిళ్లలో నిడమర్రు మండలం ఛానమిల్లి గ్రామానికి చెందిన అర్చకస్వాముల బృందం ఉదయం నుంచి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నవకలశ, పంచామృత, చతుర్ధశ కలశ ఆరాధనలు, గంగాపూజ, మహాభిషేకం, జలాధివాసం వంటి ప్రత్యేక హోమ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు విగ్రహ స్థాపన, మహాపూర్ణహారతి, ప్రాణప్రతిష్టా, శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండి స్టేషన్‌లో రైలు ఆపాలని వినతి

ఉండి: మచిలీపట్నం, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఉండి స్టేషన్‌లో ఆపాలని కోరుతూ రైల్వేబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం పంపించినట్లు ప్రయాణికుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొమ్మన నాగబాబు, సీహెచ్ బంగార్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనాకు ముందు ఈ రైలు ఉండిలో ఆపేవారని ఇప్పుడు ఆపకపోవడం దారుణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు విశాఖ వెళ్లేందుకు ఎంతో అనుకూలంగా ఉండే ఈ రైలు నియోజకవర్గ కేంద్రం ఉండిలో ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ఉండి రైల్వే స్టేషన్‌లో రెండవ నంబర్ ప్లాట్‌ఫారంపైకి వెళ్లేందుకు ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంపైనే రైలు ఎక్కేందుకు ఏర్పాట్లు చేయాలని రైల్వే బోర్డు చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



రూ.10 లక్షల ఎల్‌ఓసీ శాన్విక కుటుంబ సభ్యులకు అందజేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్రప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన కోపల్లి శాన్విక అనే రెండేళ్ల చిన్నారికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.10లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం వారి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పేరు చెప్పగానే మొట్ట మొదటిగా గుర్తొచ్చేది స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరే అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, చల్లా సత్యనారాయణ, కోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శేషుబాబుకు శుభాకాంక్షల వెల్లువ

యలమంచిలి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన మేకా శేషుబాబును శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు నాయకత్వంలో మండల నాయకులు కలసి శుభాకాంక్షలు చెప్పారు. భగవంతునికి సేవ చేసే అవకాశం మొదటిసారిగా పాలకొల్లు నియోజకవర్గానికి రావడంపై వారంతా సంతోషం వ్యక్తం చేశారు. శేషుబాబును కలిసిన వారిలో సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు నాయకులు బోనం బులివెంకన్న, ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, వీరా ఉమాశంకర్, వీరవల్లి నరసింహమూర్తి, జక్కంశెట్టి భాగ్యలక్ష్మి, నిమ్మకాయల రామకృష్ణ, జవదాల సువర్ణరాజు ఉన్నారు.

ప్రయోగాల్లో భాగస్వాములు కావాలి



చంద్రయాన్ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన విద్యార్థులు

సాక్షి, భీమవరం: చంద్రయాన్–3 విజయంతో మన దేశం ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, దీని స్ఫూర్తితో ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులు భవిష్యత్తు ప్రయోగాల్లో భాగస్వాములు కావాలని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు అన్నారు. కళాశాల విద్యార్థుల్లో చంద్రయాన్ స్ఫూర్తి నింపేందుకు ఏఐసీటీఈ సూచనలతో శనివారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ భారతదేశం భావిప్రయోగాల కోసం యువ ఇంజినీర్ల వైపు చూస్తోందన్నారు. కళాశాల స్థాయిలోనే మినీ శాటిలైట్ల ప్రయోగానికి ఇస్రో కూడా ప్రోత్సాహం అందిస్తున్నట్టు చెప్పారు. చంద్రయాన్ విజయోత్సవంపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నడింపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల రాజీ

నరసాపురం రూరల్: న్యాయాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేయించి శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 753 కేసులకు సంబంధించిన కక్షిదారులు రాజీ పడి తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. ఈ కేసుల్లో రూ.53 లక్షల విలువైన సమస్యలు పరిష్కారమయ్యాయి. 717 క్రిమినల్ కేసులు కాగా, సివిల్ కేసులు 5, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు 31 పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీనివాస్, న్యాయవాదులు, ఎస్ శ్రీధర్, సూర్యప్రకాషరావు, హనీష్‌వర్మ తదితరులు కేసుల రాజీలో కీలక పాత్ర పోషించారు.

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించి పలు కేసులను పరిష్కరించారు. పాలకొల్లు కోర్టు పరిధిలో 601 కేసులను రాజీ చేసి అవార్డులు జారీ చేశారు. ఈ కేసులు రాజీ ద్వారా రూ.45,25,998 కక్షిదారులు పరిహారంగా పొందారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి, ఏపీపీ జయసింధు, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.